ఏనుగూ, చూపులేని ఆరుగురూ

భారతీయ జానపద కథ

ఏనుగూ, చూపులేని ఆరుగురూ

భారతీయ జానపద కథ



అనగా, అనగా చూపులేనివాళ్లు ఆరుగురు ఉండే వాళ్లు. వాళ్లు చూడలేరు, కానీ ఇతర అనేక పద్ధతులలో చాలా విషయాలు నేర్చుకున్నారు, ప్రపంచం గురించి తెలుసుకున్నారు.

తమ చెవులతో వేణుగానం వినేవాళ్లు.

తమ చేతులతో పట్టు మెత్తదనాన్ని
తెలుసుకోగలిగేవాళ్లు.

వంట చేసేటప్పుడు దాని వాసన గుర్తించ
గలిగేవాళ్లు, తింటూ ఆహార రుచిని ఆస్వాదించ
గలిగేవాళ్లు.

వాళ్లంతా కలిసి తమ ఇంటి పనులు
చేసుకునేవాళ్లు. అందరూ ఎంతో
సంతోషంగా ఉండేవాళ్లు.



ఆ ఆరుగురు ఒక రోజు ఒక
కొత్త వార్త విన్నారు.
రాచమహాలుకి ఒక ఏనుగు
కొత్తగా వచ్చిందంట.



చూపులేని ఆ ఆరుగురు ఏనుగు గురించి విన్నారు, కానీ దానిని ఎప్పుడూ కలవలేదు. ఏనుగు ఎలా ఉంటుందో వాళ్లకి ఏమాత్రం తెలియదు.

“మనం రాచమహాలుకి వెళదాం, పదండి," వాళ్లల్లో ఒక వ్యక్తి అన్నాడు. “ఏనుగు ఎలా ఉంటుందో తెలుసుకుందాం."

ఆ ఆరుగురు రాచమహలుకి బయలుదేరారు.

రాచమహలు చాలా దూరాన ఉంది.

అక్కడికి వెళ్లేసరికి వాళ్లకి దాహం అయ్యింది.

ఏనుగు గురించి తెలుసుకోవాలన్న ఆతృతతో

వాళ్లు మంచినీళ్లు కూడా తాగలేదు.





చివరికి వాళ్లు మహలుకి చేరుకున్నారు. వాళ్లు ఎందుకు వచ్చారని ఒక సైనికుడు అడిగాడు.

కారణం తెలుసుకున్న తరవాత, “మీరు ఏనుగుని తాకి చూడవచ్చు. రాకుమారుడు ఏమీ అనుకోడనే అనుకుంటున్నాను," అన్నాడు సైనికుడు.

ఏనుగు ఉన్న చోటుకి ఆ ఆరుగురిని
సైనికుడు తీసుకుని వెళ్లాడు.

ఏనుగు పొట్టని చూపులేని మొదటి వ్యక్తి తాకాడు.

“ఇది చాలా పెద్దగా, బలంగా ఉంది," అతడు అనుకున్నాడు.
“ఏనుగు ఒక గోడలాగా ఉంటుందని అనిపిస్తోంది."

పొడవుగా, గుండ్రంగా ఉన్న దాని తొండాన్ని చూపులేని రెండవ వ్యక్తి తాకాడు. “అయ్యో, ఇది పాము లాగా ఉంది!" అంటూ అతను అరిచాడు.

నున్నగా ఉన్న ఏనుగు దంతాన్ని మూడవ వ్యక్తి పట్టుకున్నాడు. “ఏనుగు ఒక బరిశ లాగా ఉంది!"

ఏనుగు కాలుని నాల్గవ వ్యక్తి పట్టుకున్నాడు. ఏనుగు చెట్టు లాగా గుండ్రంగా, బలంగా ఉందని అతను అనుకున్నాడు.

ఏనుగు చెవిని అయిదవ వ్యక్తి పట్టుకుని చూశాడు.
అది చాలా చాలా పెద్దగా ఉంది.
ఏనుగు తన చెవిని మెల్లగా ఆడించింది.
అయిదవ వ్యక్తి నవ్వాడు. “ఏనుగు ఒక విసనకర్ర లాగా ఉంది!"



సన్నగా, పొడవుగా ఉన్న ఏనుగు తోకని ఆరవ వ్యక్తి పట్టుకున్నాడు. “ఏనుగు ఒక తాడు లాగా ఉంటుంది," అతడు అనుకున్నాడు.



ఆపాటికి మధ్యాహ్నం రెండు గంటలయ్యింది.
ఎండ చాలా తీవ్రంగా ఉంది.

ఆ ఆరుగురిని తోటలో ఒక చెట్టు కింద నీడలో
కూర్చోబెట్టాడు సైనికుడు.
“మీరు ఇక్కడే ఉండండి, మీ కోసం మంచి నీళ్లు
తీసుకుని వస్తాను," అతను అన్నాడు.

సైనికుడి కోసం ఎదురుచూస్తూ ఆ
ఆరుగురు ఏనుగు గురించి
చర్చించుకోసాగారు.

“ఏనుగు ఒక గోడ లాగా ఉంటుందని నాతో ఎవరూ
చెప్పలేదే," మొదటి వ్యక్తి అన్నాడు.
“గోడ ఏమిటి?" రెండవ వ్యక్తి ఆశ్చర్యపోయాడు.
“అది ఒక పాము లాగా ఉంది."

మూడవ వ్యక్తి దానికి ఒప్పుకోలేదు, “ఏనుగు ఒక బరిశ లాగా ఉంటుందని నేను కచ్చితంగా చెప్పగలను."

“చెట్టు కాండం లాగా ఉంటుంది ఏనుగు," నాల్గవ వ్యక్తి చెప్పాడు.

“గోడ? పాము? బరిశ? చెట్టు కాండం? మీరంతా తప్పు చెప్పారు. నిజానికి ఏనుగు ఒక విసనకర్ర లాగా ఉంటుంది,” అయిదవ వ్యక్తి అరిచాడు.

“లేదు! అది ఒక తాడు లాగా ఉంటుంది!"

ఆరవ వ్యక్తి అన్నాడు.

కొంత సేపటికి తోట అంతా

అరుపులతో నిండిపోయింది.

ఏనుగుని వర్ణిస్తున్న ఆ ఆరుగురు చూపులేనివాళ్ల అరుపులవి. ఆ వాదం ముగిసేటట్టు లేదు.

“గోడ!’ “పాము!" “బరిశ!"
“చెట్టు కాండం!" “విసనకర్ర!" “తాడు!"

మధ్యాహ్నం కునుకు తీస్తున్న రాకుమారుడికి వాళ్ల గొడవతో నిద్ర కాస్తా చెడిపోయింది. “ఆపండి! మీరు నా నిద్ర చెడగొడుతున్నారు!"

“మన్నించండి," చూపులేని మొదటి వ్యక్తి అన్నాడు. “ఏనుగు ఎలా ఉంటుందనే దానిపై మాలో ఏకీభావం కుదరటం లేదు. మేమందరం ఒకే జంతువుని తాకాం. కానీ ప్రతి ఒక్కరి అనుభవం వేరుగా ఉంది."

రాకుమారుడు వాళ్లకి ఓపికగా వివరించాడు-

“ఏనుగు చాలా పెద్ద జంతువు.
దాని పొట్ట గోడ లాగా ఉంటుంది.
దాని తొండం పాము లాగా ఉంటుంది.
దాని దంతం బరిశ లాగా ఉంటుంది.
దాని కాళ్లు చెట్టు కాండం లాగా ఉంటాయి.
దాని చెవులు విసనకర్ర లాగా ఉంటాయి.
దాని తోక తాడు లాగా ఉంటుంది.



“మీరందరూ సరిగానే చెప్పారు. కానీ ఒకరకంగా మీరంతా తప్పు కూడా చెప్పారు. మీలో ఒక్కొక్కరు ఏనుగులో ఒక్క భాగాన్నే తాకి చూశారు.

“నిజంగా ఏనుగు ఎలా ఉంటుందో తెలుసుకోటానికి అన్ని భాగాలను కలిపి చూడాలి."

రాకుమారుడి మాటల గురించి చూపులేనివాళ్లు ఆలోచించారు. రాకుమారుడు తెలివైనవాడని వాళ్లంతా అనుకున్నారు.

"నేను మీకు ఇంకొక విషయం చెబుతాను," రాకుమారుడు అన్నాడు.
"ఏనుగు మీద సవారీ చెయ్యటం ఎంతో బాగుంటుంది. ఇప్పుడు మిమ్మల్ని ఏనుగు ఎక్కించి ఇంటి దాకా పంపిస్తాను."



చూపులేని ఆ ఆరుగురు ఏనుగు ఎక్కి ఇంటికి వెళ్లారు.

ఆ రోజు అన్నింటికంటే ఏనుగు సవారీ బాగుందని వాళ్లంతా ఏకీభవించారు.

అయిపోయింది